క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన తీర్మానాలపై కార్మికులకు వివరించారు. సమావేశానికి హాజరైన నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అనంతరం కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

సర్వే నిష్పక్షపాతంగా జరగాలి

బొమ్మనహాళ్: పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (పీ4) సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. గురువారం మండలంలోని ఉంతకల్లు, లింగదహాళ్ గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న పీ4 సర్వే పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న పది శాతం మందికి అట్టడుగున ఉన్న 21 శాతం మందికి చేయూతనివ్వడానికి 27 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళితో సర్వే చేయాలన్నారు.

బొప్పాయి తోట పరిశీలన



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఎంపీపీ

బ్రహ్మసముద్రం : మండలంలోని రాయలప్పదొడ్డి సర్పంచ్ రామ్మోహన్‌కు చెందిన బొప్పాయి చెట్లను ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. బాధితుడు రామ్మోహన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంపీపీని పరామర్శించి, బొప్పాయి తోటను పరిశీలించారు. పోలీసులు బొప్పాయి చెట్లు నరికి వేతకు కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తీటకల్లు శంకరప్ప, యనకల్లు నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలోకి బయటి వ్యక్తులు వెళ్లకుండా చూడండి

ఉరవకొండ: మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో బయట వ్యక్తులు లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్‌కు విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ కాలేజీ హాస్టల్‌లోకి కొందరు చొరబడి విద్యార్థులను ఇష్టారాజ్యంగా చితకబాదారన్నారు. బాధితులకు పోలీస్ స్టేషన్‌లోనూ న్యాయం జరగలేదన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

రాయదుర్గంటౌన్: బీసీ కార్పొరేషన్ కింద స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం జరిగిన ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. మంజూరు చేసిన 66 యూనిట్లకు గాను పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో 602 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఇంటర్వ్యూలకు మొత్తం 419 మంది హాజరయ్యారు. సబ్సిడీ రుణాల మంజూరులో కూటమి సర్కారు తీరుపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తమవుతోంది. పట్టణ పరిధిలో కేవలం 66 యూనిట్లు మాత్రమే కేటాయించడంతో తీవ్ర పోటీ నెలకొంది.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న ఐచర్ వాహనం



విద్యుత్‌షాక్‌కు గురైన రైతు నరసింహులు

కణేకల్లు: కణేకల్లు శివారులో ఇండేన్ గ్యాస్ గోదాము వద్ద కింద పడిన విద్యుత్‌వైర్ తగిలి రైతు బోయ జయరాం అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గురువారం ఉదయం ఈచర్ డ్రైవర్ వాహనాన్ని రివర్స్ చేస్తూ కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టాడు. దీంతో కరెంటు స్తంభం కట్ అయి కింద పడింది. విద్యుత్‌వైర్లు కూడా నేలపై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్‌వైర్లలో కరెంటు సరఫరా అవుతోంది. డ్రైవర్ దీన్ని గమనించకుండా ఐచర్ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లిపోయాడు. పొలం నుంచి ఇంటికి బైక్‌లో వస్తున్న బోయ నరసింహులుకు ప్రమాదవశాత్తూ విద్యుత్‌వైర్లు కాళ్లకు తగిలాయి. దీంతో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు గమనించి విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కరెంటు సరఫరా నిలిపేసి అతన్ని కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి అనంతపురం జీజీహెచ్‌కు రెఫర్ చేశారు.


అక్కమాంబ కొండకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని ప్రసిద్ధి చెందిన అక్కమాంబ కొండకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కొండకు కింద ప్రాంతంలో నిప్పు పెట్టడంతో కొండ కింద ప్రాంతం నుంచి మంటలు పైకి ఎగబాకడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది.

ఇటీవల బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డికి చెందిన జ్యోతిబాయికి తలనొప్పి తీవ్రంగా ఉండడంతో భూపసముద్రంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిశీలించిన ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇచ్చాడు. కాసేపటికే ఇంజెక్షన్ వికటించింది. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాక చికిత్స పొందుతూ మహిళా ప్రాణాలు వదిలింది.

డి.హీరేహాళ్ మండలంలోని కల్యంలో లక్ష్మీ అనే మహిళా ఆర్ఎంపీ ఇంజెక్షన్ వేసి సెలైన్ పెట్టి, మాత్రలు ఇచ్చిన రెండు రోజుల్లోనే వికటించి రోగి మృతి చెందింది. ఇవి రెండు కేసులే కాదు.. ఆర్ఎంపీల చేతిలో సామాన్యుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కాసులకు కక్కుర్తి.. రోగులకు విరక్తి



రెఫరల్ పేరుతో ఆర్ఎంపీలు, పీఎంపీలు కొత్త దందాకు తెరలేపారు. తెలిసీ తెలియని వైద్యంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రోగికి అవసరం లేకుండా రక్త పరీక్షలు, స్కానింగ్, మెరుగైన చికిత్స అంటూ ప్రైవేట్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లకు పంపుతుండడంతో సదరు ఆస్పత్రి యజమాన్యం వీరికి కమీషన్లు భారీగా ఇస్తుండడం గమనార్హం.

– బొమ్మనహాళ్:

- నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌ల నిర్వహణ
- రెఫరల్ పేరుతో భారీగా దందా
- రక్త పరీక్షలు, స్కానింగ్ అంటూ ప్రైవేట్ ఆస్పత్రులకు పంపుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి అని సూచిస్తున్న వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో కర్ణాటక నుంచి వచ్చి ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో కర్ణాటక ఆర్ఎంపీలు ఎక్కువయ్యారు. అనారోగ్యంతో క్లినిక్‌లకు వస్తే అవసరం లేకున్నా రక్త పరీక్షలకోసం రాసేస్తున్నారు. దీంతో రోగులు డబ్బులు అధికంగా పోగొట్టుకుంటూ, దూరాభారం వెళ్లి చికిత్స పొందాలంటే విరక్తి చెందుతున్నారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలకు బళ్లారి జిల్లాకేంద్రం సమీపంలో ఉండడంతో అక్కడున్న ప్రైవేట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులకు అత్యవసర చికిత్స పేరిట రెఫర్ చేస్తున్నారు. ఆర్ఎంపీలు సూచించిన ఆస్పత్రి, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లకు మాత్రమే వెళ్లాలని సూచిస్తున్నారు. ఇందుకుగాను రోగి ఫీజులో 30 నుంచి 40 శాతం కమీషన్, ఎక్కువ మంది రోగులను పంపితే ప్రత్యేక ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ క్లినిక్‌లు..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో 500 మందికి పైగా ఆర్ఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్నారు. మూడు నియోజకవర్గాల్లో ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వచ్చే రోగులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆర్ఎంపీ వైద్యులు ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకొని క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తెలిసీ తెలియని వైద్యంతో మెడికల్ దుకాణాలను పక్కనే ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఆర్ఎంపీలు క్లినిక్‌లోనే శ్యాంపిల్ మందులు తెచ్చి కమీషన్లకు కక్కుర్తిపడి ఎక్కువ మోతాదులో సూది మందు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు.. ఎంబీబీఎస్‌ల తరహాలో స్టెతస్కోప్ చేతపట్టి అన్ని రకాల రోగాలకు వైద్యం చేస్తున్నారు.



ఉంతకల్లులోని ఓ క్లినిక్‌లో సెలైన్ బాటిల్ ఎక్కించిన దృశ్యం



ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



ఉద్దేహాళ్‌లో నూతనంగా ఏర్పాటైన ప్రథమ చికిత్స కేంద్రం

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవు. అలా చేసే ప్రథమ చికిత్స కేంద్రాలు సీజ్ చేయడంతో పాటు పోలీసు కేసులు నమోదవుతాయి. ప్రతి ఆర్ఎంపీ అర్హత పత్రాలను కలిగి ఉండాలి. పేర్లకు ముందు డాక్టర్ అని పెట్టుకోరాదు. ప్రథమ చికిత్స అనంతరం ప్రభుత్వ ఆస్పత్రులు సిఫార్సు చేయాలి. ఆర్ఎంపీలు ఇంజెక్షన్ వేయడం, బెడ్లు ఏర్పాటు చేసి సెలైన్ బాటిళ్లు పెట్టడం వంటికి చేస్తే చర్యలు ఉంటాయి. అనుమతి లేని ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీలు చేస్తాం.

– డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం



కూడేరు: మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చింది. పార్టీకోసం పనిచేసిన వారికి పట్టం కడుతున్నారు. అందులో భాగంగా వైఎస్సార్ సీపీ మండల నూతన కమిటీని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంపిక చేసి పంపినట్లు మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన వివరాలు వెల్లడించారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా కుమ్మర రామ్మోహన్ (ఉదిరిపికొండ), ఎర్రిస్వామి (ముద్దలాపురం), ప్రధాన కార్యదర్శులుగా హనుమంతరెడ్డి (గొటుకూరు), రంగారెడ్డి (కమ్మూరు), శ్రీనివాసులు (మరుట్ల-1), శంకరయ్య (కరుట్లపల్లి), కార్యదర్శులుగా అవిలికొండ చంద్రశేఖర్ (అంతరగంగ) బోయ ఎర్రిస్వామి(ఎంఎంహళ్లి), గోవింద్ (గొటుకూరు), నగేష్ (మరుట్ల-1), జయప్ప (పి.నాగిరెడ్డిపల్లి), కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్ (కొర్రకోడు), శ్రీకాంత్ (కూడేరు), ఎర్రిస్వామి (కడదరకుంట), కోటేశ్వరరావు (ఉదిరిపికొండ), శంకరయ్య (శివరాంపేట), సంజీవ (జయపురం) పెద్ద ఓబులేసు (మరుట్ల-3), అల్లా బకాష్ (శివరాంపేట)లను ఎంపిక చేసినట్లు రామచంద్రారెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



కర్ణాటక మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బ్రహ్మసముద్రం: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన అక్రమ మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. గురువారం మండల కేంద్రం సమీపంలో భైరసముద్రం రోడ్డులోని బండపై అసిస్టెంట్ ఎక్సైంజ్‌సూపరింటెండెంట్ రేవతి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం ధ్వంసం చేశారు. సుమారు 166 కేసులు నమోదు చేసి, సీజ్ చేసిన మద్యాన్ని ధ్వంసం చేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు ఎస్ఐలు నరేంద్రకుమార్, ప్రవీణ్ , నగేష్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలో పలు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం, నాటుసారా, డీపీఎల్ మద్యాన్ని రూరల్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. పట్టు బడిన 30 కేసుల మద్యాన్ని గురువారం ఎక్సైజ్ ఏఈఎస్ రేవతి, రూరల్ సీఐ వంశీ కృష్ణ సిబ్బంది ధ్వంసం చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రూరల్, పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో 33 మద్యం కేసుల్లోని 770 ప్యాకెట్ల కర్ణాటక మద్యం, 101 నాటుసారా ప్యాకెట్లు ఎక్సైజ్ ఏఈఎస్ రేవతి, రూరల్ సీఐ వంశీకృష్ణ దాడుల్లో పట్టుబడింది. ఈ మద్యాన్ని గురువారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

‘రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలి’

కుందుర్పి: రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగంగా డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ లింగప్ప, తెనగల్లు సర్పంచు వెంకటేశులు తదితరులు అన్నారు. గురువారం వారు కుందుర్పిలో విలేకరులతో మాట్లాడారు. తెనగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కురుబ శివలింగప్ప,కురుబ శ్రీకంఠేశ్వర, మల్లయ్య,బాబు తదితరులు టీడీపీ మద్దతుదార్లు కురుబ సిద్దన్న, శ్యామన్న, హనుమంతరాయుడు తదితరులు దాయాదులన్నారు. వీరికి కరిగానిపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 68, 69,67,72-2, 60-2,60-4,60-5, 60-6,60-7 పైసర్వే నంబర్లలోని 74 ఎకరాల భూమిని గత దశాబ్దాలుగా సాగు చేస్తున్నారన్నారు. సర్వేనంబర్ 60-2లో 14.42 ఎకరాల భూమిని 1998-99లో టీడీపీ మద్దతుదార్లయిన సిద్దన్న,శ్యామన్న, హనుమంతరాయుడు రెవెన్యూ అధికారులతో పాసుపుస్తకాలు చేయించుకున్నారన్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ మద్దతుదారులైన సిద్దన్న కుటుంబం వారు పై 14.42 ఎకరాల భూమి తమదేనంటూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన శివలింగప్ప తదితర వారిని పైభూమిలోకి రాకుండా అడ్డగించారన్నారు. దీంతో శివలింగప్ప దాయాదులకు చెందిన వారు కోర్టుకు వెళ్లారని, నేటికీ కళ్యాణదుర్గం, అనంతపురం, హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే ఇటీవల ఉన్నపళంగా కళ్యాణదుర్గం సివిల్‌జడ్జ్ కోర్టులో టీడీపీ మద్దతుదారులు తాత్కాలిక ఇంజెక్షన్ ఆర్డరు తెచ్చుకున్నారన్నారు. మరో రెండు కోర్టుల్లో కేసు నడుస్తుండగా తహసీల్దార్ పోలీస్ ప్రొటెక్షన్ పేరుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ సిద్దన్న కుటుంబ సభ్యులు తెచ్చిన తాత్కాలిక ఇంజెక్షన్ ఆర్డర్ మేరకు పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ కురుబ శివలింగప్ప సోదరులు భూమికి సంబంధించిన ఆధారాలు చూపితే పోలీస్ ప్రొటెక్షన్ రద్దు చేస్తామన్నారు.

బియ్యం సక్రమంగా అందించండి

కళ్యాణదుర్గం: కార్డుదారులకు ఇష్టారాజ్యంగా బియ్యం పంపిణీ చేస్తే ఊరుకునేదిలేదని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు డీలర్లను హెచ్చరించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి నియోజకవర్గంలోని రేషన్ షాపు డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ డీలర్లు అవినీతి, అక్రమాలకు తావు లేకుండా గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1నుంచి రేషన్ వేయాలని సూచించారు. ఎండీఎం వాహనదారుడు ఒక ప్రభుత్వ ఉద్యోగి అన్న విషయం గుర్తించుకోవాలన్నారు.

బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న యూనియన్ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి జిల్లా, రాష్ట్ర టూవీలర్ మెకానిక్ యూనియన్ నాయకులు హాజరయ్యారు. తొలుత పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి బైక్ ర్యాలీ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. లక్ష్మీబజార్ ప్రధాన రహదారి, పాత బస్టాండ్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా శివారులోని నేషనల్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడారు. టూవీలర్ మెకానిక్ వృత్తితో జీవనోపాధి పొందుతున్న వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక యూనియన్ అధ్యక్షుడు చమ్మా అన్వర్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, అబ్దుల్లా, ఉస్మాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దర్గా గేటు ఏర్పాటుకు చర్యలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని సయ్యద్ జాఫర్ షావలి దర్గాకు వెళ్లే మార్గం గేటు ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం పనులు ప్రారంభమవుతాయని కాలనీవాసులు ఎంఐఎం అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ గోన బావి నిజాముద్దీన్, అహమ్మద్ ఖాన్, అల్లాబకాష్, సులేమాన్ గురువారం తెలిపారు.

పీహెచ్‌సీ ఉద్యోగులకు మెమోలు జారీ

బొమ్మనహాళ్: స్థానిక పీహెచ్‌సీలోని ఇద్దరు ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు డీడీఓ డాక్టర్ శ్రీలక్ష్మీ గురువారం తెలిపారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు పీహెచ్‌సీలో విధులకు గైర్హాజరవుతూ, పనితీరు సరిగా లేని సెకెండ్ మెడికల్ ఆఫీసర్ మల్లీశ్వరి, స్టాఫ్ నర్సు రోజాకి మెమోచ్చినట్లు తెలిపారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

రాయదుర్గంటౌన్: నూతన ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాయదుర్గం శాఖ అధ్యక్షుడు శేషగిరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీమా కార్యాలయం ముందు ఉద్యోగులు సమ్మె చేసి, నిరసన తెలియజేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేసన్‌కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెన్నహోబిలం సమీపంలో కంటైనర్ బోల్తా

ఉరవకొండ: అనంతపురం నుంచి బళ్లారికి ఐరన్ లోడుతో వెళ్తున్న కంటైనర్ పెన్నహోబిలం సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. కంటైనర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వాహనదారులు గమనించి డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు.

యువకుడి ఆత్మహత్య

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డీహీరేహాళ్ మండలంలోని సిద్ధాపురం తండాలో లోకేష్ నాయక్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, గ్రామస్తుల వివరాల మేరకు.. తావు నాయక్, లక్ష్మీబాయి దంపతుల కొడుకు లోకేష్‌నాయక్‌కు పదేళ్ల క్రితం జ్యోతిబాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. లోకేష్‌నాయక్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం భార్య జ్యోతిబాయి ఇంట్లో వంట చేస్తోంది. అదే సమయంలో ఇంట్లోని సిమెంట్‌కమ్మీకి కండువాతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య .. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతన్ని కిందకు దింపి, బళ్లారి విమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బ్రహ్మసముద్రం : గుడిపల్లికి చెందిన రైతు బోయ తిప్పయ్య (70) ఎద్దు పొడిచి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను అనంతపురం సవేరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంటికి వచ్చిన ఆయన.. ఈనెల 19న రక్తపు వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

అప్రమత్తతతో డెంగీ నివారణ

రాయదుర్గంటౌన్: అప్రమత్తతతోనే ప్రాణాంతక డెంగీ నుంచి రక్షణ పొందొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని మల్లాపురంలో డెంగీ రాకుండా నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ షబానా, ఎంఎల్ హెచ్‌పీ ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కెంచంపల్లిలో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి అంగన్‌వాడీ కేంద్రం పక్షం రోజులుగా మూతపడింది. ఈనెల 6న అంగన్‌వాడీ ఆయాకు ఓ ప్రైవేట్ గొడవలో రక్తగాయాలయ్యాయి. దీంతో కార్యకర్త, ఆయా బాధ్యులను చేస్తూ గ్రామానికి చెందిన పలువురు వారిని బయటకు పంపి, సెంటర్‌కు తాళాలు వేశారు. ఘటనపై ఆశాఖ పీడీ వనుజాఅక్కమ్మ, ఇన్‌చార్జ్ సీడీపీఓ రాధ తదితరులు గ్రామానికి వెళ్లి పూర్వాపరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సుగుణ జరిగిన సంఘటపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పక్కనే ఉన్న అప్పాజిపాళ్యం అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిదేవిని ఇన్ చార్జ్‌గా నియమించినా సెంటర్ మాత్రం తీయ లేదని సర్పంచ్ గంగాధర తెలిపారు.

గడ్డి వామికి నిప్పు

విడపనకల్లు: హావళిగికి చెందిన లస్కరి వెంకటేశులుకు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. వేరుశనగ పొట్టు, జొన్న సొప్ప, వరిగడ్డి వామి పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

కల్లు దుకాణాలపై దాడులు



అధికారులు సీజ్ చేసిన కల్లు బాటిళ్లు

రాయదుర్గం: పట్టణంలోని కల్లు దుకాణాలపై స్టేట్ ఎస్టీఎఫ్ టీమ్ గురువారం ఆకస్మికంగా దాడులు చేసింది. కల్లు తయారీ కేంద్రం (డిపో)లో సోదాలు చేశారు. అనంతరం ల్యాబ్‌టెస్ట్ కోసం బాటిళ్లను సీజ్‌చేసి తీసుకెళ్లారు. వివరాలను స్థానిక సీఐ మహేష్‌కుమార్ వెల్లడించారు. డిపోకు కొంత దూరంగా ఉండే వ్యవసాయ క్షేత్రంలో అనుమానితంగా కొన్ని మత్తు పదార్థాలు పట్టుబడ్డాయని, వాటిని కూడా శ్యాంపిల్స్ కోసం ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. కల్తీ కల్లును ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. డిపో వద్ద ఉండే రంగనాథ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. అతని నుంచి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. నిషేధిత ఆల్ప్రాజోమ్ పాకెట్లు, క్లోరల్ హైడ్రోట్ రసాయనాలు పట్టుబడ్డాయని, కొందరు వాట్సాప్ ద్వారా ట్రోల్ చేశారని, ఇందులో వాస్తవం తేలాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్‌తో పాటు స్టేట్ ఎస్టీఎఫ్ టీమ్ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ అధికారుల కోసం ఎదురుచూపు



కైరేవు రైతు సేవాకేంద్రం వద్ద అధికారి కోసం ఎదురుచూస్తున్న రైతులు

శెట్టూరు: మండలంలోని కైరేవు రైతు సేవా కేంద్రం వద్ద వందాలది మంది రైతులు వ్యవసాయ అధికారుల కోసం ఎదురుచూశారు. గురువారం ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు కైరేవు రైతు సేవా కేంద్రానికి చేరుకున్నారు. 11:30 నిమిషాలైనా అగ్రికల్చర్ అసిస్టెంట్ విధులకు హాజరు కాకపోవడంతో రైతులు ఎండలో పడిగాపులు కాశారు. గ్రామానికి రైతు సేవాకేంద్రం సుమారు కిలోమీటర్‌కుపైగా దూరం ఉంది. వృద్ధులు, మహిళా రైతులు తాగు నీరు లేక ఇబ్బందులు పడ్డారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో డిమాండ్లపై చర్చిస్తున్న ఏపీ పీటీడీ నాయకులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం డిపోలోని ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో సమస్యలపై చర్చించారు. అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు జిలాన్ , కార్యదర్శి తిప్పేస్వామి, గ్యారేజీ కార్యదర్శి సతీష్‌కుమార్, దూద్ పీరా, నాగరాజు, యోగేంద్రకుమార్, తిమ్మరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గవిమఠం బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న సహాయ కమిషనర్ రాణి

ఉరవకొండ: గవి మఠం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని సహాయ కమిషనర్, మేనేజర్ కె. రాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో ప్రసిద్ధి చెందిన గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గవిమఠం పీఠాధిపతుల విడిది మంటపాన్ని రూ.2లక్షలతో మరమ్మతు చేయిస్తున్నట్లు తెలిపారు. గవిమఠం ఆవరణలోని భజన మందిరంతో పాటు ఫ్లోరింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. రూ.3లక్షల తో మరమ్మతు చేయిస్తున్నట్లు తెలిపారు. పూర్వ పీఠాధిపతుల సమాధులను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. గవి మఠం ఆవరణలో పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నీటి వసతితో పాటు మహిళలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు.